**కథ**

# వెలుతురు పుష్పాలు

''బాబూ! ఒక్కసారి బస్సు ఆపు నాయనా!''

స్టాపులో ఆగకుండా వెళ్తూన్న బస్ వెనకగా, ఒగుర్చుకుంటూ మరీ అన్నాడు జగన్నాథం!

జగన్నాథపురం వంతెన దగ్గర బస్సెక్కి, యింటికి చేరటం, చాలా ఏళ్ళుగా, దినచర్య అయిపోయింది జగన్నాథం జీవితానికి.

రిటైరు అయినా పనిచేసే ప్రయివేటు కంపెనీ, తన ఉద్యోగాన్ని, ఎక్సెంటెన్షన్ చేసినా, పైనబడుతూన్న వయసు, తన దృష్టిని ఎక్స్టెండు చెయ్యటం లేదన్న నిరాశ తనని దిగదీస్తున్నా, బ్రతుకు తెరువులోని, టైర్నెస్‌ని బయటికి కనుపడ నీయకూడదనే, సదా విశ్వప్రయత్నం చేస్తూన్నాడు జగన్నాథం.

కీచ్‌మంటూ బస్సు ఆగింది-

కండక్టరు డోరు తీసి, నవ్వుతూ ఆహ్వానించాడు. జగన్నాథానికి మహాశ్చర్యమనిపించింది. ఏళ్ళ తరబడి నిత్యం చూసుకునే, ముఖాలైనా ఎప్పటికప్పుడు క్రొత్తగానే మాట్లాడే కండక్టరు, ఇలా నవ్వడం విడ్డూరమనుకునేటంతలో..చిరాగ్గాముఖం పెట్టి, ''తప్పుకుని ఆడోళ్ళకు దారియ్యరా?!..'' అన్నాడు కండక్టరు.

జగన్నాథానికి ఏమీ అర్థం కాలేదు-

ఓ పద్దెనిమిదేళ్ళ పడుచుదనం తనని అధిగమిస్తూ, గబగబా బస్సులోనికి ఎక్కడం, కండక్టరు వెకిలిగా నవ్వడం..నిముషాల్లో జరిగిన చర్య!

జగన్నాథానికి అప్పుడర్థమైంది. ముందటి నవ్వు..ఎవరికోసమో!!

స్త్రీలకు కేటాయించని, ఓ సీటులో కిటికీ ప్రక్కన కూర్చుని, భారంగా ఊపిరి తీసుకున్నాడు జగన్నాథం! బస్సువంతెన దాటుతోంది!

జగన్నాథం..గతంకు- భవిష్యత్తుకూ వారధే కాదు..తన బాల్యానికి..వార్ధక్యానికి..వేసిన బంధం ఆ వంతెన! మారుతూన్న కాలాన్ని, వ్యవస్థనూ, విలువల్ని, భిన్న మనస్తత్వాల్నీ, ప్రతిబింబించే, ఆ వంతెన, దాని పరిసరాల్ని పరిశీలించడం, వ్యక్తిగా తన వికాసానికి ఎంతో ప్రయోజనకారి అయిందనుకుంటూ తన మధ్యతరగతి మందహాసాన్ని కొనసాగిస్తున్నాడు జగన్నాథం!

బస్సును షేక్ డాన్సు చేయిస్తూ ముందుకు నడుపుతున్నాడు డ్రైవరు. దబదబా బస్సు రేకుల చప్పుడుతో 'మార్కెట్ సెంటర్' అరుపు వినవచ్చింది.

ఆగకుండానే ఖాళీ పట్టాలూ, గోనెసంచీకట్టలూ, బస్సులోని వాళ్ళ తలలూ-నడుములూ కాళ్ళకు తగిలించుకుంటూ, ఏకలవ్యులంత దీక్షతో దిగేవాళ్ళు దిగుతున్నారు. ఎక్కేవాళ్ళూ తమ తమ ప్రయత్నాలు చేస్తున్నారు.

''కల్పనా సెంటర్..కల్పనా..'' మళ్ళీ దబదబా చప్పుడు, బస్సు ఆగింది.

నెలలు నిండని చంటిబిడ్డలతో, అరడజను మంది ఆడవాళ్ళు, సినిమా సరదాతో బిల బిల మంటూ దిగారు-

రకరకాల రంగుల ప్రలోభాల కట్ ఔట్లు-అటూ-యిటూ స్వాగతాల్ని పలికే సినీమావీధి అది! జనాలు..ప్రభంజనంలా క్యూలు కడుతూన్నారు.

సుమారు శతాబ్ది క్రింద నిర్మించబడి, సకల కళామతల్లికి, అలుపూ సొలుపూ లేకుండా, సదా సేవలందించే 'సూర్య కళామందిరం!' బోసి నోరు వెళ్ళబెట్టి-జాలిగా చూస్తోంది.

ఆరోజు-సంగీత కార్యక్రమం..నాటక ప్రదర్శన వున్నట్టున్నాయి! ముసలాడికి దసరా పండుగలా లైట్లతో వెలుగులను వెలార్చుతోంది!

ప్రాచీన కళల్ని..సినీమాతిమింగలం నేడు మింగేస్తే, సహజన నటన సంస్కృతివిరులు..పరిమళించేదెక్కడ?!!

> **స్వర్ణభారతి అపూర్వ చరిత్ర మరచి, స్వ-రణ భారతిగా నిలిపే ప్రజలు వారి మనోగతి! నిరక్షరాస్యులుగా, తమ ఆలోచనతో, ఆత్మగౌరవంతో, అడుగు ముందెయ్యక పోవడమే లోపం!**

జగన్నాథానికి 'సూర్య కళామందిరం' చూడగానే, గత వైభవ స్మృతులు, యంగ్ మెన్సుహేపీ క్లబ్, గానసభలు..అందించిన మహాకళాకారులు..కళ్ళల్లో మెదలి..మనసు మరింత ఆర్ద్రమైంది.

''కొంచెం జరుగు గురూ..'' అంటూ ఇద్దరు కుర్రాళ్ళు జగన్నాథాన్ని మూలకు నెట్టేసి ఒళ్ళో కూర్చున్నట్లుగా కూర్చున్నారు.

వాళ్ల చేతుల్లో చుట్టచుట్టినట్లున్న నోట్సు పుస్తకాలు, క్రికెట్ బ్యాట్‌లు. నోటి నుండి సిగరెట్టు వాసన..విలాసాలు!

ఆ కాలేజీ విద్యార్థులపై నుండి దృష్టి మరల్చిన జగన్నాథంకు 'ఆనంద భారతి' జనంతో నిండి ఉండడం గమనించాడు! అది రాజకీయ పార్టీ వాళ్ళ మీటింగు. మినిష్టర్లొస్తున్నారట! రెగ్యులర్ ట్రాఫిక్కును మరింత యిబ్బంది పెడుతూ బస్సుల్ని ఆపారు.

అసలు, అన్ని హంగులూ పుష్కలంగా వుండి కూడా మన దేశం యిలా వెనుకబడడానికి కారణం ఏమిటో జగన్నాథం బుర్రలో తళుక్కున మెరిసింది.

స్టార్లు, మినిష్టర్లు- క్రికెటర్లు- భజన సంఘాలు..మంది మనసులకు, మనుషుల విభజనలే వారి ప్రగతి పూర్ణబింబానికి, పట్టిన-గ్రహణాలన్నదే, జగన్నాథం-అభిప్రాయం!

నేటితరంలో సహజమైన ప్రేమ, ఆప్యాయత..పెద్దలయెడ గౌరవం ఆదరణలు..అన్నీ కొరవడ్డాయి! వాటికి నెలువై నిలిచిన, ''ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కుప్పకూలడమే'' అంటాడు జగన్నాథం. ఒక బాడీలోని పార్టులా ఉండవలసిన వాళ్ళు, ఏ పార్టుకాపార్టు విడిపోయి, ఎపార్టుమెంట్లల్లోకి ఎగిరిపోతూన్నారు.

ఈ కాలానికి పెద్దలలోని మమకారం, ప్రేమ, గౌరవం, పరోపకార బుద్ధులు అందున్న ఆంతర్యాలు, అర్థాలు, వీళ్ళకెలా తెలుస్తాయన్న సందేహం కల్గుతుంది.

ముందు-వెనుకసీట్లోని కుర్రాళ్ళు-అమ్మాయిలకు-ట్రైల్సు-రియాక్షన్సు..యిలా వ్రాయడానికి వీలులేని భాషలో నిర్లజ్జగా..అభినయాలతో వివరిస్తూన్నారు! గుటకా పేకట్లు చింపి, నోట్లో పోసుకుని, మరీ వింటున్నారు మిగతావాళ్ళు!

బస్సు మళ్ళీ బయల్దేరుతుండగా..

గబగబా అడుగులు వేసుకుంటూ, యిద్దరు మధ్య వయసు ఆడవాళ్లు, బస్సులోనికి చొరబడి, నిలబడి..భారీగా ఊపిరి తీసుకున్నారు.

ఒకరు మున్సిపల్ డిపార్టుమెంటు ఉద్యోగిని, మరొకామె టీచరు.

జగన్నాథానికి గత కొద్ది సంవత్సరాలుగా పరిచయమైన మొహాలే! వాళ్ళను చూస్తే అభినందించాలన్న ఆలోచనొచ్చినా, జాలేస్తూంటుంది! స్త్రీ సహజమైన సౌకుమార్యం, ప్రశాంతత్త్వం..స్థానంలో..యిలాంటి కంగార్లు, టెన్షన్లతో..వాడిపోయిన మందారాల్లా వున్నారు. మళ్ళీ ఇంటికి వెళ్ళగానే పని చక్రంలో..గిర గిరా తిరగకతప్పదు! సమానత్వం పేరుతో, సహజ స్వేచ్ఛను, ప్రశాంతతను, తమ వ్రేళ్ళ సందుల్లోంచి, జారవిడుచుకుంటున్నారనే జాలి ఆప్యాయత, లోటవుతూన్నది-అవగాహన!

వేడినీళ్ళకు కాస్త చన్నీళ్ళు తోడైతే, దొరికే గోరువెచ్చని హాయి, పోయి, చన్నీళ్ళే మిగులుస్తూన్న కన్నీటి కాపురాలు!

మగమహారాజులు, తమ సరదాలకు, వృథాగా డబ్బు తగలెయ్యకుంటే, యింటి భారం, తన కాళ్ళ మీద మోయవల్సిన దుర్గతి, స్త్రీకి ఉండదేమో!

అవగాహనా లోపం ఉన్నందువల్లనే, ఉభయులూ,

ఉద్యోగాలకెళ్లే కుటుంబాల్లో నడిచే చరిత్రను పరికిస్తే, నేడు తెలిసే, నగ్న నిజాలు ఎన్నో..జాలి కల్గిస్తున్నాయి.

బస్సు ఇంజను ఆపకుండా, సౌండు పెంచి, తగ్గించి....పొగవదుల్తూ..కాలుష్యాన్ని మరింత పెంచుతూ..చుట్టూ పంచుతూ..ఇక బయల్దేరేస్తోందన్నట్టుగా, హడావిడిని చేస్తున్నాడు డ్రైవరు! ప్రక్క బస్సులకు పోటీగా యత్నిస్తున్నాడు.

విసుక్కుంటూన్న లోనున్న జనం మాటలు విన్నట్టుగా లేడు. మరొక బస్సు వచ్చి దాని ముందు ఆగగానే సంధించిన బాణంలా బయల్దేరింది బస్సు!

కొత్తపేట గాంధీ బొమ్మ స్టాపులో మొక్కుబడిగా ఆగి, బయలుదేరింది.

జగన్నాధం కళ్ళు..ఆ విగ్రహం స్థితినే కాదు, ఆ పరిసరాల్ని కూడా తడిమాయి! చిరుతిళ్ళు అమ్మే తలపండిన మామ్మ! గంపెడు పిల్లల్ని కన్న తల్లిలా..మూగిన పిల్లలకు, మాగిన పళ్ళను, చిరు-తిను బండారాలను..ఆప్యాయంగా అమ్ముతోంది!

రోజూ తినే అన్నం-ఆవకాయలాంటి వాటి మీద, మనకు విసుగు ఎలాగ రాదో-జగన్నాధానికి-ఇలా తనకు నిత్యం పరిచయం అవుతూన్న వాటినే, పరిశీలిస్తూండటం! అదో తృప్తి!

టు టౌన్! సెంటరొచ్చింది.

బస్సులో తొక్కుళ్ళూ-తోపులాటలూ..మరింత ప్రారంభమయ్యాయి.

వేడి వేడి వేరు శనగకాయలు అమ్మే బండి దగ్గర ఇద్దరు కానిస్టేబుల్సు!

బొజ్జ నిగడదన్ని నిలబడి..ఉచితంగా ఒక్కొక్క వేరు శనగకాయ తింటూ-మీసాలు సవరించుకుంటూ కబుర్లు చెప్తున్నారు..బక్క చిక్కిన ఆ బండివాడు-బేరం కోసం దిగాలుగా ఎదురుచూస్తున్నాడు.

''ఏయ్-తిన్న కాయలకు రెండు రూపాయల వుద్ది-పెట్టు..'' అని, ఆ బండి వాడంటే ఎంతో బావుండునని, జగన్నాధానికి విచిత్రమైన ఆలోచన వచ్చింది. సరే! ఫ్రీడంకు, బ్రేకులు వేస్తూ, ఫినాయిలైనా..పట్టేయడమే ఫిలాసఫీ అయిన పోలీసోళ్ళను, అలాగ అడగ్గల దమ్ము, ఈ ప్రజాస్వామ్యంలో, ఎంతమందికున్నదన్నది ప్రశ్నార్థకమే!

ఓ కానిస్టేబుల్..ఫుట్ బోర్డు మీద వున్న వాళ్ళపై, అజమాయిషీ చేసి తను ఫుట్‌బోర్డుపైన వ్రేలాడుతూ నిలబడ్డాడు-

ఒక చేతిలో కేరేజీ, వాటర్ బాటిలుతో బ్యాగ్, మరొక చేతిలో ఆఫీసు ఫైలుతో..అతికష్టం మీద బస్సెక్కవల్సి వచ్చినా..నోట్లో సిగరెట్ మాత్రం వదలకుండానే లోపలికి ప్రవేశించాడు ఓ ప్రభుత్వ ఉద్యోగి!




నలభై అయిదేళ్ళ అతన్ని పరిశీలించడం, జగన్నాధంకు మహాసరదా!

ప్రొద్దున్నా సాయంత్రం..ఎవరు ఏమైనా, బస్సెంత సేపు ఆగినా, ఏ గందరగోళం సాగినా, అతను క్రమం తప్పక ఆచరించే పని ఒకటుంది! బస్సు ఎక్కగానే, ఎలాగో అలాగ దొరికిన ప్లేసులో మత్తుగా కళ్లు మూసుకుని..యోగనిద్రలోనికి జారిపోవడం!

మధ్య ఏదైనా చప్పుడయితే, కళ్ళు తెరిచి, మళ్ళీ ధ్యానంలోకి వెళ్ళడం అతని ప్రత్యేకత!

బస్సు 'భానుగుడి' సెంటర్లో ఆగింది.

నగరంలోని సాయం సంబరమంతా ఆ సెంటర్లోనే కనిపిస్తోంది! అందం-ఆనందం-అరడజను అమ్మాయిల రూపంలో-తుళ్ళుతూ..బస్సులో ప్రవేశించాయి..ఎక్కడో స్విచ్చి నొక్కితే, మరెక్కడో లైటు వెలిగినట్టు..మరో అరడజను జీన్సు-బాణీలతో, నూనూగు మీసాలు..బాడీ గార్డుల్లా బస్సెక్కారు-

పోటాపోటీలతో కిళ్ళీ షాపుల్లోంచి హైవాల్యూమ్ మ్యూజిక్ వినిపిస్తోంది. ఊకదంపుడుగా వివిధ వాద్యాల తెలుగు పాటలే అవి! శబ్ద కాలుష్యాన్ని పుష్కలంగా పంచుతున్నాయి. బస్సులోని యువత ఆ సంగీతానికే, కాళ్ళూ చేతులూ, చిత్రంగా వూపుతున్నారు. మనసెక్కడుందో తెలీదు.

వెరికాట్ ప్యాంటు మీద, ఇస్త్రీ చేసిన ఖద్దరు లాల్చీ వేసుకున్న ఓ గడ్డం వ్యక్తి చుట్టూ మూగిన ఓ పది మందితో ఏదో చర్చిస్తున్నాడు. ఏదో యిస్తాననీ, పని చేయిస్తాననీ, చెబుతున్నాడు. వాళ్ళు దణ్ణాలు పెట్టి మరీ దిగి వెళ్ళిపోయారు.

డా. శిరీష

జగన్నాథం వెనుక సీట్లో కూర్చున్నవారు, ఇతన్ని గురించి మాట్లాడుతూన్న దాన్ని బట్టి- ఓ ఎదుగుతూన్న రాజకీయ నాయకుడని అర్థమైంది! వాళ్ళ సంభాషణ వైపు ఓ చెవి పారేశాడు.

మొన్న జంక్షనులో రాస్తారోకో, మాణ్యం కాలనీ దీక్షకు వెనకాల ఉన్నది. ఇతని హస్తమే! అంతేకాదు, బంద్‌లు, పార్టీ మీటింగులకు..ఎమ్.ఎల్.ఏలు యితన్నే పిలుస్తారు!

''ఇంతకూ, ఇతనెవరో తెలుసా?!''

''ఏమో! నాకేం తెలుస్తుంది. ఏ రాజకీయ నాయకుడి కొడుకో..అయ్యుంటాడు!''

''నువ్వు మరీ పూర్వకాలంలో వున్నావు- మన జోడు థియేటర్ల దగ్గర బ్లాక్‌టిక్కెట్లు అమ్మేవాడు. గుర్తుందా.? ఆ రౌడీయే ముదిరి, రాజకీయ నాయకుడయ్యాడు!''

''నిజంగానా?!..ఇవాల్టి, పాలిటిక్స్‌కీ-పాలీ ట్రిక్స్..ఇవే!''

జగన్నాథం మనస్సు ఒక్కసారి కలుక్కుమంది.

తనెరిగిన రాజకీయ నాయకులు, చేతలతో, చిత్తశుద్ధితో నిరాడంబరత్వం, విజ్ఞతలకు పునాదిగా నిలిచిన పదిమందికి ఆదర్శంగా, అనుసరణీయంగా..వుండేవారు!

ఈనాడు-ఇలా డబ్బు-గూండాగిరీలు-స్వార్థం..కులతత్వం, యిటుకలుగా పేర్చి, తమ రాజకీయ భవన నిర్మాణాన్ని కొనసాగిస్తూన్నారు-

మేథావులు-స్వంత గదులకే పరిమితమై, తమ విజ్ఞాన వీచికల్ని, కాగితాలపై వెళ్ళగక్కి, కాస్త ఉపశమనాన్ని పొందుతూన్నారు-అంతే!

స్వర్ణభారతి అపూర్వ చరిత్ర మరచి, స్వ-రణ భారతిగా నిలిపే ప్రజలు వారి మనోగతి! నిరక్షరాస్యులుగా, తమ ఆలోచనతో, ఆత్మగౌరవంతో, అడుగు ముందెయ్యకపోవడమే లోపం!

బహుకృత వేషాలతో, పది నాల్కలతో, సతమతమయ్యే జనాలను, మాటల ప్రలోభం పెట్టి, ఓటు హక్కును, బూడిదలో పన్నీరులా చేస్తున్నారనే నగ్న సత్యం, దీన్ని యీ ప్రజలు గ్రహిస్తే-ఈ దేశానికి పట్టిన గ్రహణం వీడినట్లే!

బస్సు బయల్దేరింది.

దురదృష్టవంతుల అంతర్భాగాల్లోని, రాచపుండ్లను, రూపుమాపడానికై, నడుం కట్టి నిలువెత్తు కట్టడంగా అభయమిస్తూన్న కేన్సర్ హాస్పిటల్, నాగమల్లితోట స్టాపుల్లోంచి బస్సు ముందుకు కదుల్తోంది.

రోడ్డుకటూ-యిటూ మందహాసం చేస్తున్నట్టి, విద్యాప్రగతి నిలయాల్ని దాటుకుని సాగిన బస్సు..సర్పవరం జంక్షనులో ఆగింది.

ఆ సెంటరులో, తెలుగు వెలుగుల తేజఃపుంజంగా, దిగంత కీర్తి హస్తాన్ని చాటుతూన్న నాయకుడు యన్.టి.ఆర్-నిలువెత్తు విగ్రహం! నిండుగా నిల్చింది కూడలిలో-

ఆ టైములో..ఈ బస్సు మీదే ఆధారపడిన, అలవాటుబడినట్టి ప్రయాణీకులు బస్సుమీద ఈగల్లా మూగేశారు.

ఇటు గైగోలుపాడు, సర్పవరాలకు రోడ్డు-అటు, వాకలపూడి, బీచ్‌రోడ్డు..వచ్చిన రోడ్డుకు అభిముఖంగా..పిఠాపురంకు సాగే రోడ్డులకు ప్రగతిని చాటే జంక్షను ఇదే!

ఎంతో మార్పు వచ్చింది.

ఇక్కడున్న మార్కెట్టుకు, ఓ ప్రత్యేకత ఉన్న కారణంగా-అనేక చిన్న, చిల్లర లేక చుట్టుప్రక్కల, పల్లెల నుండి, పండ్లు కూరగాయలు, అపరాలు..అనేకం అమ్ముకోడానికి వచ్చే అనేకమంది, ఆ జంక్షనులోని దళారులకు నిత్యం మోసపోతుంటారు. వాళ్ళ యుక్తులకు, కుయుక్తులకూ బలవుతుంటారు.


అక్కడే-అధికవడ్డీకి, తాత్కాలిక అప్పులు యిస్తూ, జలగల్లా పీల్చేసే, చిట్టి వ్యాపారస్తులు, సైకిలు, మోటారు బైకులు మీద వచ్చి, పగలంతా పల్లె వ్యాపారస్తులు పడిన కష్టాన్ని క్షణాల్లో నొల్లుకు పోతూంటారు ఆ పెద్దలు.

రకరకాల వృత్తులు-ప్రవృత్తులు! చిత్ర మనస్కులకు, విచిత్ర కూడలి యిది!

బస్సు కిట కిటలాడిపోతోంది. డోరు క్రింద కనబడ్డ ఒక దృశ్యం, జగన్నాథాన్ని కదిలించింది! నిండుకుండలా నిలిచిన గర్భిణీస్త్రీ-ఆమె భర్త, కొడుకుల్ని సముదాయిస్తోంది.

తన నొప్పులు మరచి, మమతామూర్తిగా వాళ్ళకు మరింత ధైర్యం చెప్తోంది.

''నువ్వు జాగ్రత్తగా బేరాలు సూడు! అమ్మను హాస్పటలులో ఉంచి, నేను పొద్దున్నే ఒచ్చేత్తా!'' చెప్తూన్న తండ్రిని ఆపి, ''ఒరే! కన్నా..ఆ గిన్నెలో అన్నం-పప్పుసారూ వుందిరా..మరిచిపోక తిను..తిరగమాకు!'' అంటూ కొడుకుపైన, ఆప్యాయత కురిపించిందా తల్లి. మనసు-కళ్ళు చమరిస్తున్నాయి. బాధను పళ్ళ బిగువుతో అనుభవిస్తూ-సృష్టికి-ప్రతిసృష్టిని చేయు ప్రకృతి, పరిపూర్ణ స్వరూపంలా, ఉందామె!




''నాన్నా..నాకెందుకే ఈ పైసలు..అమ్మ కోసం, హాస్పటలులో యివ్వాలిగదా..ఉంచు!'' అంటూ కన్నతల్లియెడల తనకున్న అభిమానాన్ని చాటుకుంటున్నాడు ఆ కుర్రాడు! తన అమ్మను, బస్సెక్కించడానికి, అయ్యకు సాయపడుతూ వచ్చాడు.

బస్సులోని వారు పార్లమెంటు సీటంత భద్రంగా ఆక్రమించుకుని, వదలకుండా కూర్చున్నారు. ఆడవాళ్ళు కూడా ఎవరూ ఆ గర్భిణీకి సీటు యీయటం లేదూ.

జగన్నాథం తన సీటులోంచి లేచాడు.

తల్లిలాంటిది..తల్లికాబోతోంది..మనం నిలిచి, ఆమెను కూర్చోబెడ్దాం...అన్నాడు కుర్రాళ్ళతో.

మానవత మొగ్గ తొడిగింది.

ఆ కుర్రాళ్ళు వెంటనే రియాక్టయ్యారు. ''మీరు పెద్దవారు-కూర్చోండి! ఫరవాలేదు, మేం లేచి, ఆమెకు సీటిస్తాం!'' అనడంతో జగన్నాధానికి ఎంతో ఆనందం, ఆశ్చర్యం కలిగాయి.

''ఆమె ప్రక్కన భర్త ఉండడం, ఎంతైనా యీ సమయంలో అవసరం గదా'' అంటూ మానవీయత మారుటాకు వేసింది! వాళ్ళను సరిగా కూర్చోనిచ్చారు.

చుట్టుప్రక్కల సీట్లలోని కాలేజీ అమ్మాయిలు, మహిళలు- 'గిల్టీ'గా ఫీలవడం జగన్నాథం గమనించక పోలేదు!

ఇప్పుడు అందరిలోనూ, అపూర్వంగా సింపతీ-హ్యూమానిటీలు..కళ్ళ అంచుల్లో నిలిచాయి అనడానికి నిదర్శనంగా టీచరమ్మ కాస్త పాలు త్రాగమంటూ, తన బాటిలులో మిగిలినవి యివ్వడం- ఆ మునిసిపల్ ఉద్యోగి-మంచినీళ్ళు అందించడం-మరో పెద్దావిడ, తన భర్తను లేపి, గర్భిణీని..తన వొళ్ళో కాస్త వీలుగా పడుకోమనడం..అన్నీ జగన్నాథంలో మనసు, మరింత తృప్తితో వెలిగిపోయేలా చేశాయి.

విభిన్న మనుషులు-వింతైన మనస్తత్వాలు-వున్న దేశం మనది!

మమత, మానవతలతో ముందడుగేస్తేనే ప్రగతి!

ఎన్నింటిలోనో తరాలు-అంతరాలు-వ్యత్యాసాలెన్ని వున్నా, అంతరంగపు అట్టడుగుపొరల్లో అమృతధారలున్నాయి. సహజీవనం సాగిస్తూనే వున్నాయి.

మనమందరం-మానవులం! యీ సమాజ నందన వనానికి సౌరభాలం!

ఈరోజు నాటే స్వచ్ఛమైన మానవతా విత్తనాలు, సౌభ్రాతృత్వాల తరువులు కావాలి!

సత్యశాంతి, వెలుగుల్ని పుష్పిస్తాయంటూన్న భరోసాగా.. పూర్ణగర్భిణీతో, బస్సు కదిలింది.

జాతీయ రహదారిపై హుందాగా సాగుతోంది!

★